కరువు నేలలో సిరుల పంట

పెద్దముడియం : చరిత్రలో ఎన్నడూ లేనంతగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి తీవ్రమైన కరువు ఏర్పడుతోంది. కాని పెద్ద పసుపుల గ్రామానికి చెందిన దుంపా వెంకటేశ్వరరెడ్డితో పాటు మరో ఇద్దరు రైతులు 2 ఎకరాల చొప్పున చిన్నబళ్లారి ఉల్లి పంట సాగుచేసి సిరుల పంట పండించారు.

గ్రామంలోని రైతులు దాదాపు 12000 ఎకరాల భూమి ఉన్నా సాంప్రదాయమైన శనగ పంటనే అందరూ పండిస్తూ ఉండేవారు. కాని శనగ పంట సాగుచేస్తూ ఉన్న దిగుబడి అంతంతమాత్రంతో తోడు గిట్టుబాటుధర కూడా పెద్దగా లేకపోవడంతో గ్రామంలోని ముగ్గురు రైతులు ప్రయోగాత్మకంగా ఉల్లిపంటను సాగు చేశారు. సెప్టెంబర్‌లో కురిసిన వర్షానికి పంటను సాగుచేసిన తరువాత వర్షం కురవకపోయినా మైలవరం కాలువల ద్వారా వచ్చే నీటితో నీటి తడులను అందిస్తూ వచ్చారు. ఎకరాకు 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని క్వింటా రూ.4700కు విక్రయించామని తెలిపారు. ఎకరాకు రూ.80 వేలు పెట్టుబడిపోయినా రెండు లక్షల రూపాయలు పైగా ఆదాయం వచ్చిందని తెలిపారు.


ఉల్లిగడ్డలను కోస్తున్న కూలీలు


ఉల్లిగడ్డలను లారీకి ఎత్తుతున్న కూలీలు


తూకం వేస్తున్న కూలీలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లిగడ్డలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సుధాకరరెడ్డి, సమావేశ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి.నాగేశ్వర్ రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

19 నుంచి రైతులకు శిక్షణ

మైదుకూరు : పసుపు పంట సాగుపై ఈనెల 19 నుంచి రెండు రోజులపాటు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పసుపు సాగులో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు శిక్షణ ఇస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గేటిపల్లి సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

వేంపల్లె : పట్టణంలోని 119 సంవత్సరాల చరిత్ర గల శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస పూజలను ఘనంగా ప్రారంభించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ధనుర్మాస పూజలు జనవరి 14 వరకు జరుగుతాయన్నారు. ఆలయంలో ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవారి పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే వెంకటేశ్వరస్వామికి, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహిస్తామన్నారు.

దారికి మరమ్మతులు


ముళ్ళపొదలను తొలగిస్తున్న జేసీబీ

చింతకొమ్మదిన్నె : మండలంలోని కమ్మవారిపల్లి నుంచి పొలతల పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల పెరిగిన ముళ్ళపొదలను తొలగించడంతో పాటు, రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులను ఆదివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో చేపించారు. గతంలో కమ్మవారిపల్లి పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల కోరిక మేరకు ఈ పనులను చేయించారు.

ఉత్సాహంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చాపాడు: మండలంలోని రాజువారిపేట, అయ్యవారిపల్లె గ్రామాలలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు సంచార వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీధర్‌నాయుడు, డ్వాక్రా ఏపీఎం వెంకటరమణ స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో ఉత్తీర్ణత సులభతరం

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన డిపార్టుమెంట్ పరీక్షలు అవగాహన సదస్సులతో ఉత్తీర్ణత సులభతరం అవుతుందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకులు సీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కడప ఎన్‌జీవోభవన్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిపార్టమెంట్ పరీక్షలపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీటీఎఫ్ అమరావతి బిట్స్ బుక్లెట్ ద్వారా సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యకు సంబంధించిన నిబంధనలు, సీసీఏ రూల్స్, సబార్డినేట్ సర్వీస్ రూల్స్, జెడ్పీ యాక్టుపై పట్టు సాధించడం వంటి అంశాలతో గెజిటెడ్ ఆఫీసర్ టెస్టు ఉత్తీర్ణత సులభతరం అవుతుందన్నారు. అలాగే పెన్షన్, బడ్జెట్, ఫైనాన్స్, రాజ్యాంగంపై విశ్లేషణాత్మకమైన ప్రశ్నావళిని నల్లబల్లపై వివరిస్తూ ప్రశ్నావళి సమాధానం చేసే విధానాలను తెలిచేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో తమ సంఘం ఆధ్వర్యంలో మాక్‌టెస్టుల రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. విద్యాక్రాంతి డాట్ ఇన్ నుండి దిగుబడి చేసుకుని ప్రాక్టీసు చేసుకోగలరని వివరించారు. రాష్ట్ర విద్యా ఐటీ సెల్ ప్రతినిధి రెహమాన్ మాట్లాడుతూ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించుటకు చేపట్టాల్సిన ప్రయత్నాలను గురించి వివరించారు. ప్రశ్నా ప్రతానికి జవాబు చేసే విధానంలో ఉన్న ట్రిప్పులను ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు వివరించడం జరిగింది.

నేడు కార్డుల పంపిణీ

చాపాడు: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని కార్యక్రమాన్ని సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభాభవనంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధు లు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

ప్రజాభిప్రాయసేకరణ పుస్తకాలు పంపిణీ

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమానికి సంబంధించిన ప్రజాభిప్రాయసేకరణ పుస్తకాలను ఆదివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లకు అందజేసి మాట్లాడారు. ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పథకాలతో ఎంత మంది లబ్ధిపొందారు, అందడం పట్ల వారి అభిప్రయాలను సేకరించాలన్నారు. ఏపీకి ఎంతో అభివృద్ధి చేశారు కాబట్టి ఏపీకి జగనన్నే కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాభిప్రాయ సేకరణ పుస్తకాలను సచివాలయ కన్వీనర్లకు అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంకాలమ్మపేటలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు ఆదివారం వైద్యులు, స్నేహ, ప్రత్యూషలు వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు ఇప్పటి నుంచి శ్రద్ధగా చదివి అలాగే ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నపాటి జబ్బులు, దగ్గులు వచ్చిన వెంటనే వైద్యలను సంప్రదించాలన్నారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండలరావు, వైద్యులు బాలనారాయణరావు, వసతి గృహ వార్డెన్ నాగసుబ్బమ్మ తదితరుల పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైష్ణవాలయాల్లో వైభవంగా పూజలు

ప్రారంభమైన ధనుర్మాస కార్యక్రమాలు

కడప కల్చరల్ : జిల్లాలోని వైష్ణవాలయాలలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు అభిషేకాలకు హాజరయ్యారు. తొలిమంచు వేళలో సూర్యకిరణాలు భూమాతను స్పర్శిస్తున్న ఘడియల్లో భక్తిభావంతో వచ్చే ప్రజలతో ఆలయాలు కళకళలాడాయి. వైష్ణవ ఆలయాలలో తిరుప్పావై పూజలు ప్రారంభించారు. ఉదయం స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సూర్యోదయానికి ముందే సామూహికంగా విష్ణు సహస్ర నామా పారాయణాలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు ప్రత్యేకంగా పగలు పత్తు కార్యక్రమంలో భాగంగా గోదాదేవి తిరుప్పావై పాశురాల పారాయణం చేశారు. అనంతరం నివేదన, నక్షత్ర కుంభ హారతులు, చతుర్వేద స్వస్తి, భజనలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

దేవునికడపలో.. దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4.30 గంటలకే పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఒకటి చొప్పున పాశురాలను గానం చేయడంలో భాగంగా పండితులు తొలి పాశురాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరికొన్ని వైష్ణవాలయాలలో కూడా ప్రతి రోజు 30 పాశురాలను ఆలపిస్తారు.

శ్రీ లక్ష్మీసత్యనారాయణ ఆలయంలో.. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, దేవతా మూర్తులకు అలంకారం, ఆరాధన నిర్వహించారు. పాశురాల ఆలాపన, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాశురాల పారాయణం చేశారు. అనంతరం వారందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలు 30 రోజులపాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇంకా.. కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం తదితర వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవుళి బజారు రామాలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో పాశురాల గానం, ధనుర్మాసం విశిష్టతలపై ప్రసంగాలు చేశారు.


విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక 3వ వార్డు సచివాలయం వద్ద ఆదివారం ఏపీ క్లాప్ డ్రైవర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 37 మంది క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి రూ.18,500 వేతనాలు ఇవ్వాలని, సెలవులు, మంజూరు చేయాలని, వెహికల్ రిపేరు చేయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని కోరారు. రాజ్‌కుమార్, నరేష్, కిరణ్‌బాబు, పవన్, భాస్కర్ రావు, రాజేష్, సునీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల...

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహణదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు

ప్రొద్దుటూరు క్రైం : గుండె జబ్బులను ఎవ్వరూ అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. నెహ్రూ రోడ్డులోని లక్ష్యా కార్డియాక్, కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి 40 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి గుండె స్కానింగ్ చేశారు. గుండె సమస్యలున్న వారికి చికిత్సకు సంబంధించి సూచనలు ఇచ్చారు. అలాగే డాక్టర్ హరిత 32 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా మూడవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

ఆటా సదస్సుకు కడప అధ్యాపకుడు

కడప ఎడ్యుకేషన్ : అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆట) అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలు గు విశ్వ విద్యాలయం అడిటోరియంలో ఆదివారం ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు–2023ను ఘ నంగా నిర్వహించారు. ఈ సదస్సుకు కడప యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆచార్యు లు తప్పెట రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలు అతి ప్రాచీనమైన ప్రదర్శన కళలన్నారు. ఇవి మానవుని అనుభూతులకు, మానసిక చైతన్యానికి, ఆనందో త్సాహాలకు ప్రతీకలని వివరించారు. అందువల్లనే ఇవి అనంతమైన రూప వైవిధ్యం కల్గి ప్రజా జీవితానికి అత్యంత సన్నిహితంగా ఉంటాయన్నారు. ఈ జనపద కళలు ప్రజల మద్యే పుట్టి పెరిగి ప్రజల కోసం అనేక వందల సంవత్సరాల నుంచి సజీవంగా ఉన్నాయన్నారు. ఇందులో కొన్ని కళలు కనుమరుగైనా మరికొన్ని నేటికి సజీవంగా మిగిలి ఉన్నా యని ఈ జానపద సంపద జాతికి గర్వకారణం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతంలో చూసిన వి విధ కులాలకు సంబంధించిన విశిష్టమైన జానపద కళారూపాలు అనేక మున్నాయన్నారు.

ఘనంగా భవాని శంకరుడి విగ్రహ ప్రతిష్ట

జమ్మలమడుగు : మండలంలోని ధర్మాపురం పొలిమేర హద్దులో ఉన్న భవాని శంకరుడి విగ్రహ ప్రతిష్టతోపాటు హనుమంతుడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించటానికి గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెన్నూరు : స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన శ్రీమాతమ్మతల్లి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే సోమవారం మాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట తదితర కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఘనంగా బర్సీ మహోత్సవం


ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహం నడుమ బర్సీ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. బాణా సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల నడుమ జరిగిన ఊరేగింపులో యువకులు వివిధ రకాల నృత్యాలు చేశారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి భక్తులందరికి గంధం పంపిణీ చేశారు. నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిస్వామి, మౌలానా స్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సన్మానం

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్ల భవనంలో సీనియర్ సర్వీసు పెన్షనర్లకు సన్మాన కార్యక్రమాన్ని రిటైర్డు లెక్చ రర్ రామసుబ్బారెడ్డి ఆధ్యక్షతన ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 70, 80 ఏళ్ల వయస్సు పూరైన 22 మంది పెన్షనర్లకు ఎసన్మానం చేశారు. పెన్షనర్ల సంఘం, అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో పెన్షనర్లు

జొన్న కంకి నవ్వింది.. పిట్ట వచ్చి వాలింది..

సాగు చేసింది మొదలు.. పంట చేతికందేవరకు రైతన్నకు కంటిమీద రెప్ప పడదు. ఓ సారి వానలు భయపెడతాయి... మరోసారి చీడపీడలు చుట్టుముడతాయి.. ఈ గండాలన్నీ దాటుకుని చేను నవ్వుందంటే.. అదును చూసి పక్షులు వాలిపోతాయి. ఏంచక్కా మాటు వేసి ఇదిగో ఇలా కంకి కంకికి కాటు వేసి ఖాళీ చేస్తాయి. అందుకే పక్షుల తాకిడి నుంచి జొన్న పంటను కాపాడుకోవడానికి రైతన్నలు ఎన్నెన్నో పాట్లు పడుతున్నారు. రాజుపాళెంలో జొన్న సాగు చేసిన రైతులకు పంటపై పక్షులు వాలకుండా శబ్దం చేస్తూ పిట్టలను పారదోలడమే పనైంది. ప్రస్తుతం జొన్న కంకి గింజ బాగా కావడంతో పక్షుల దృష్టి ఆకర్షిస్తోంది. దీంతో పక్షులు వాలకుండా శబ్దాలు చేస్తూ వాటిని వెళ్లగొట్టే పనిలో రైతులు మునిగితేలుతున్నారు. –రాజుపాళెం





'పుత్తా' ఉనికి కోసం పాకులాడుతున్నాడు

చింతకొమ్మదిన్నె : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసిహారెడ్డి తన ఉనికి కోసం పాకులాడుతూ దారిన కనబడిన వారందరికీ కండువాలు వేస్తూ పార్టీలో చేరారని డప్పు కొట్టుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు సోముల నారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మామిళ్లపల్లెలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మామిళ్లపల్లెలో పర్యటించారని, ఇందులో భాగంగా తన స్వగృహానికి వచ్చి మంచినీరు అడిగితే తాము ఇచ్చామే తప్ప పార్టీలో చేరలేదని వారు తెలిపారు. ఇందులో భాగంగా ఆయన పత్రికలకు ఇచ్చిన ప్రకటనలను ఖండిస్తూ తాము ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి తాము ఎప్పటికీ వైఎస్సార్ సీపీ విదేయులమని, రవీంద్రనాథ్‌రెడ్డికి ఆప్తమిత్రులమని తెలిపారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యలు ఇప్పటికైనా టీడీపీ నాయకులు మానుకుంటే బాగుంటుందని వారు హితవు పలికారు. కార్యక్రమంలో 16వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డితో సోముల నారాయణరెడ్డి

రతనాల వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తిరుప్పావై పాశురాలను పఠించారు. వేకువజామున శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. శ్రీకృష్ణుడు గోదాదేవిలకు ప్రత్యేక పూజాలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

